క్లుప్తంగా

అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ



లక్షగాజుల అలంకరణలో పద్మావతీ అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): ధనుర్మాసం సందర్భంగా భీమవరం జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అమ్మవారిని లక్ష గాజులతో అలంకరణ చేశారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, ఆలయ చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం లక్ష గాజులతో అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి ఖమ్మానికి చెందిన అనంతరామ్, సత్యవాణి దంపతులు 16 గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, ఫొటో అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు.

బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు



బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో గొబ్బిళ్ల సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): ధనుర్మాసం సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ చిన్నారులు బొల్లం శ్రీవల్లి, నార్ని కృత్తిక సత్య, కోయ ప్రణీత, దురితలచే గౌరీపూజ, గొబ్బిళ్ల పూజ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మన సంస్కృతీ సాంప్రదాయాల్లో పండుగలు ప్రధాన భాగమని, నేటి యువతకు నాటి ఆచారాలు పండుగలు తెలియడం లేదని, నేటి తరానికి వాటిని అందించాలనే సంకల్పంతో ఇటువంటి పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 94 మంది చిన్నారులచే ఆట పాటలు, గొబ్బిళ్ల సంబరాలు నిర్వహించారు. అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, పెండ్యాల ఆదిత్య శర్మ సహకారంతో చిన్నారులకు కానుకలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళా సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హైటెక్ హరిదాసు



మోపెడ్‌పై తిరుగుతున్న హరిదాసు

ఉండి: చేతితో చిడతలు, భుజంపై వీణతో, కాళ్లకు గజ్జలతో, తలపై బిక్షపాత్రతో హరి గోవింద, గోవింద, హరిలో రంగ హరీ అంటూ ఇంటింటికీ తిరుగుతూ సంక్రాంతి శోభ తెచ్చే హరిదాసులు ఇప్పుడు రూటు మార్చారు. పెరిగిన సాంకేతికతను వినియోగించుకుని వాయిస్ రికార్డర్‌ను ఏర్పాటు చేసుకుని మోపెడ్‌పై ఇంటింటికీ తిరుగుతున్నారు. పుష్యమాసం, హరినామ సంకీర్తనలతో హరిదాసు బిక్షాటన చేసి ప్రజల పాపాలు హరించేందుకు హరిరూపం దాల్చి హరిదాసుడు వచ్చాడనేది పురాణాల కథనం. పూర్వకాలం హరిదాసుడు వచ్చాడంటే సంక్రాంతి పండుగ ఇంటి ముంగిటకి వచ్చిందంటూ ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేసేవారు. కాని ప్రస్తుత బిజీ లైఫ్‌లో సంస్కృతీ సాంప్రదాయాలు మూలన పడిపోతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. మండలంలోని తరటావ గ్రామంలోని పుంత పోరంబోకు స్థలాన్ని కొంత మంది ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని, కోళ్లు, పశువులు పెంచుతున్నారని, గడ్డివాములు వేసి, దడులు, టార్పాలిన్లు కట్టి ఇబ్బంది పెడుతున్నారన్నారు. తన చేపల చెరువు గట్టుకు వెళ్లకుండా ఇబ్బంది పెడుతున్నారని, మేతలు, చేప పిల్ల వేయడానికి వాహనాలను రానివ్వడం లేదని గ్రామానికి చెందిన మల్లారెడ్డి అన్నపూర్ణ ఫిర్యాదు చేశారన్నారు. అదే ప్రాంతంలో పంట బోదెను పూడ్చి దాసరి ఏసోబు అనే వ్యక్తి చెరువుకు దారి మార్గం లేకుండా అడ్డు పడుతున్నారని బోయిన వెంకట రామారావు ఫిర్యాదు చేశారని తెలిపారు.

ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కోలాటంలో పాల్గొన్న విద్యార్థులు

పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించగా ఉత్సవాల్లో భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లులు, హరిదాసులు, కోలాట నృత్యాలు ఎంతగానో అలరించాయి. పండుగల్లో తెలుగు వారి నోరూరించే రుచికరమైన వంటకాలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాలను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు తిలకించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణ నిషాంతవర్మ, ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ సాగి సత్యప్రతిక్ వర్మ, ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

–భీమవరం



సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటను వెలిగిస్తున్న దృశ్యం



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గంగిరెద్దుల విన్యాసాలు

కొనసా..గుతున్న లిఫ్టుల నిర్మాణం



రైల్వే స్టేషన్‌లో పిల్లర్ల దశలోనే లిఫ్ట్ నిర్మాణ పనులు



లిఫ్ట్ పూర్తికాక మెట్లపై నుంచి దిగుతున్న ప్రయాణికులు

- రైల్వే స్టేషన్‌లో లిఫ్టులకు మోక్షమెప్పుడో.. ?
- రెండు రైల్వే బడ్జెట్లు పూర్తైనా.. కదలని పనులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ఆకివీడు: రైల్వే బడ్జెట్లు రెండు పూర్తైనా స్థానిక స్టేషన్‌లో లిఫ్టు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రెండేళ్లు గడచినా పిల్లర్ల దశలోనే లిఫ్టు పనులు పలు స్టేషన్లలో ఆగిపోయాయి. రైల్వేశాఖ అధికారుల నిర్లక్ష్యానికి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులే కాకుండా ఇటీవల యువత కూడా ఒళ్లు నొప్పులు, మోకాళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆసుపత్రికి వెళ్లి రావడానికి ప్రయాణాలు చేస్తున్నారు. విజయవాడ-నర్సాపురం, భీమవరం-నిడదవోలు బ్రాంచి రైల్వే లైన్ల ఆధునికీకరణ ఈ ప్రాంత ప్రజలకు శాపమా అనే విధంగా ఉంది. ఒక పక్క నిత్యం వ్యాగన్ల రాకపోకలతో గేట్లు పడి వాహన చోదకులకు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది.

ప్లాట్‌ఫారాలు మారాలంటే ఇబ్బందే..

మరో పక్క రైల్వే ప్రయాణికులు రెండో ప్లాట్ ఫారానికి వెళ్లాలన్నా, దిగాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రయాణం అలసట లేకుండా ఉంటుందని భావించి అధిక శాతం మంది ప్రయాణికులు రైళ్లలో ప్రయాణిస్తూ రైల్వేశాఖకు కోట్లాది రూపాయల ఆదాయాన్ని కల్పిస్తున్నారు. అయినప్పటికీ ప్రయాణికులకు తగిన వసతులు కల్పించడం లేదు. విజయవాడ నుంచి నర్సాపురం వరకూ భీమవరం నుంచి నిడదవోలు వరకూ బ్రాంచి రైల్వే లైన్‌లోని స్టేషన్లలో కుడి, ఎడమ వైపులలో రైళ్లు నిలుపుదల చేస్తున్నారు. దీని వల్ల ప్రయాణికులు రెండో ప్లాట్ ఫారం నుంచి ఒకటో ప్లాట్ ఫారం వైపుకు రావాలంటే మెట్లు ఎక్కి రావాల్సి వస్తుంది. సుఖ ప్రయాణం కాస్తా మెట్లు ఎక్కడంతో అలసట, కాళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే శాఖ అధికారులు వెంటనే అన్ని స్టేషన్లలో లిఫ్టుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇటు వైపుగా వెళ్లే రైళ్లు

- విశాఖ–లోకమాన్య తిలక్
- విశాఖ–మచిలీపట్నం
- నరసాపురం–గుంటూర్
- పూరి–తిరుపతి
- బిలాస్‌పూర్–తిరుపతి
- నరసాపురం–విజయవాడ
- నరసాపురం–నాగర్‌సోల్
- నరసాపురం–హుబ్లీ
- కాకినాడ పోర్టు–పుదుచ్చేరి
- నరసాపురం–ధర్మవరం
- నరసాపురం–లింగంపల్లి
- కాకినాడ–ఎంఎంటీ బెంగుళూరు
- విశాఖ–సికింద్రాబాద్
- కాకినాడ టౌన్–లింగంపల్లి

మెట్లు ఎక్కలేకపోతున్నాం



ఆకివీడు నుంచి రోజూ ఉద్యోగి నిమిత్తం భీమవరం వెళుతున్నాను. భీమవరంలో మెట్లు ఎక్కి ఒకటో ప్లాట్ ఫారానికి వెళ్లాల్సి వస్తుంది ఆకివీడులో రెండో ప్లాట్ ఫారం వైపు వెళ్లాలి కాబట్టి ఇక్కడ మెట్లు ఎక్కాల్సిన అవసరం లేదు. అయితే భీమవరం నుంచి వచ్చినప్పుడు మెట్లు ఎక్కి రెండో ప్లాట్ ఫారానికి రావడం చాలా ఇబ్బందిగా ఉంది మోకాళ్ల నొప్పులు వస్తున్నాయి. ఉద్యోగాలు చేసి అలసిపోయి వస్తున్నా మళ్లీ మెట్లు ఎక్కి దిగడం ఎంతో ఇబ్బందికరంగా ఉంది.

–బలగ వెంకటలక్ష్మి, ఆకివీడు

చాలా ఇబ్బందిగా ఉంది



గత 20 ఏళ్లుగా రైలు ప్రయాణం చేస్తున్నాను ప్రతి రోజూ భీమవరం నుంచి ఆకివీడు, ఆకివీడు నుంచి భీమవరం వెళ్లడానికి ప్లాట్ ఫారాలపై మెట్లు ఎక్కి దిగాల్సి వస్తుంది. చాలా ఇబ్బందికరంగా ఉంటుంది ఒక్కోసారి ఆయాసం తీవ్రంగా వస్తుంది. నాకే ఇలా ఉంటే వృద్ధులు, చిన్న పిల్లలు, అనారోగ్యంగా ఉన్న వాళ్ల పరిస్థితి ఇంకెలా ఉంటుందో అర్థమవుతుంది. వెంటనే లిఫ్టు నిర్మాణం పూర్తి చేయాలి.

–యాసిన్ షరీఫ్, భీమవరం

నేటి నుంచి ఏపీఈఆర్సీపై ప్రజాభిప్రాయ సేకరణ



ఎస్ఈ రఘునాథబాబు

భీమవరం(ప్రకాశం చౌక్): 2025–26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీల (టారిఫ్) ప్రతిపాదనలపై జనవరి ఏడు, ఎనిమిది, పది తేదీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వారు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆలపాటి రఘునాథబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)పై ఏడు, ఎనిమిది తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ–కన్వెన్షన్ సెంటర్, పదో తేదీన కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలో ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి ఒంటి గంట వరకు నేరుగానూ, రెండు నుంచి నాలుగున్నర గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో విని యోగదారులు అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. ఏపీఈఆర్సీ అధికారులు, ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీజెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఏపీఈఆర్సీ చైర్మన్ (ఇన్‌ఛార్జి) ఠాకూర్ రామసింగ్ ఆధ్వర్యంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో అభ్యంతరాలు చెప్పదలుచుకున్న వారు సమీప విద్యుత్ కార్యాలయం (ఎస్ఈ ఆఫీస్) భీమవరం లేదా డివిజన్ కార్యాలయం (ఈఈ ఆఫీస్) నరసాపురం లేదా తాడేపల్లిగూడెం (ఈఈ ఆఫీస్) ద్వారా తమ అభిప్రాయాలు తెలియజేయాలని రఘునాథబాబు కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పెదకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఆకివీడు: ఉపాధి హామీ పనులు ప్రజలకు ఏమైనా ఉపయోగపడుతున్నాయా, కేవలం కూలీలకు భృతి కల్పించడమేనా, అనే అంశాలను పరిశీలించేందుకు సోమవారం మండలంలోని పెదకాపవరం, చినకాపవరం గ్రామాల్లో కేంద్ర బృందం ప్రతినిధులు పర్యటించారు. 2020–21, 2021–2022, 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. పెదకాపవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధి హామీ నిధులతో మొక్కలు నాటడం, స్థల పూడిక వంటి పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి, ఆయా పనులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గార్డెన్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చినకాపవరంలోని స్టోరేజ్ మంచినీటి చెరువును పరిశీలించారు. ఉపాధి హామీలో చెరువు తవ్వకం పనులు, కూలీల వేతనం, తదితర వాటి రికార్డులను పరిశీలించారు. చెరువు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జల జీవన్ మిషన్, జలశక్తి అభియాన్, అమృత్ సరోవర్ నిధుల వినియోగంపై బృందం ప్రతినిధులు జితేంద్ర సింగ్, మౌనికలు డ్వామా ఎస్ఈ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈఈలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెదకాపవరం సర్పంచ్ ఊసల బేబీ స్నేహ, ఉపసర్పంచ్ పాతపాటి పద్మావతి శ్రీనివాసరాజు, జీఏస్ కో–ఆర్డినేటర్ ఎస్.రవితేజ వర్మ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణం.. రివర్సు

ఆశ్చర్యానికి గురైన ప్రయాణికులు



శృంగవృక్షం రైల్వే స్టేషన్ వద్ద రివర్స్‌లో వచ్చిన రైలు

భీమవరం: సహజంగా మనమంతా బస్సులు, కార్లు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోల వంటి వాహనాలను రివర్స్ గేర్‌లో వెళుతుండడం చూస్తుంటాం. దీనికి భిన్నంగా రైలు బండి రివర్స్‌లో వచ్చిన విచిత్ర పరిస్థితి ఇది. వివరాలోనికి వెళితే సోమవారం నరసాపురం నుంచి విజయవాడ వెళ్లే రైలు ఉదయం పదిన్నర గంటలకు పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలోని రైల్వేస్టేషన్‌లో ఆగాల్సి ఉంది. అయితే స్టేషన్‌లో ఆగాల్సిన రైలు ముందుకు వెళ్లిపోయింది. దీంతో శృంగవృక్షం రైల్వే స్టేషన్‌లో దిగాల్సిన, ఎక్కాల్సిన ప్రయాణికులు ఆందోళనలో పడ్డారు. సుమారు రెండు కిలో మీటర్ల దూరం వరకు వెళ్లి రైలు తిరిగి వెనుకకు రావడంతో రైలులోని ప్రయాణికులు, రైల్వే గేటు వద్ద ఆగిన ఇతర వాహనాల ప్రయాణికులు ఆశ్చర్యానికి గురయ్యారు. తామేప్పుడు ముందుకు వెళ్లిన రైలు రివర్స్‌లో వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లడం చూడలేదని ఇలా ఎందుకు జరిగిందో తెలియడం లేదన్నారు. దీనిపై రైల్వే అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మదన గోపాలునికి ప్రత్యేక పూజలు



మదన గోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి

ఆకివీడు: ధనుర్మాస సోమవారం సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో వచ్చి ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. అనంతరం తిరుప్పావై 22వ పాశురం చదివారు. స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేసిన కదంబ నైవేద్యం సమర్పించారు. ఆరోగ్యానికి ఉపయోగపడే కూరగాయలతోపాటు, బియ్యం, కందిపప్పు, పెసరపప్పులతో కలిపి వండిన కదంబను భక్తి శ్రద్ధలతో ప్రసాదంగా స్వీకరించారు. ఆలయ అర్చకులు సుదర్శన శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

చదరంగంలో ఉచిత శిక్షణ



విద్యార్థులకు చదరంగం శిక్షణ ఇస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదరంగం కోర్సు లెవెల్–1పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కోచ్ మాదాసు కిషోర్ తెలిపారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో సత్యం పబ్లిక్ స్కూల్‌లో చెస్ ఉచిత శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. స్కూల్ ప్రిన్సిపల్ దుర్గా అంజనీ కుమారి మాట్లాడుతూ చదరంగం విద్యార్థుల్లో చెస్ ద్వారా సృజనాత్మకత, ఏకాగ్రత పెంపొందించుకోవచ్చన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం





త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక త్యాగరాజ భవనంలో 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్ సత్యనారాయణమూర్తి మ్యూజిక్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యాచారులు ఎం.సురేంద్రనాథ్ (హైదరాబాద్) వారిచే ఏర్పాటు చేసిన కూచిపూడి, భరత నాట్యం శ్రోతలను అలరించింది. 30 మంది కళాకారులతో ప్రదర్శించిన అద్భుత నాట్య సంగమం పలువురిని ఆకట్టుకుంది. సుమారు నాలుగు గంటల పాటు సాగిన నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహా భారతంలోని ద్రౌపది పడిన కష్టాలు, అవమానాలు భరిస్తూ జరిగిన సన్నివేశాల కథనాలతో నృత్య ప్రదర్శన చూపరులను కట్టి పడేసింది. పాండవులు, కౌరవుల మధ్య గల వైరాన్ని, జూదంలో ధర్మరాజు తన సర్వస్వాన్ని కోల్పోవడం, ద్రౌపది వస్త్రాపహరణం, రౌద్రుడైన భీముడు దుర్యోధన దుశ్శాసనులను వధించడం తదితర సంఘటనలతో నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో గన్నాబత్తుల శ్రీనివాస్, చెరుకువాడ వెంకట్రామయ్య, చెరుకువాడ రంగసాయి, కారుమూరి చినబాబు, ఆరేటి ప్రకాష్, దాయన చంద్రాజీ, అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఫసల్ బీమా యోజన గడువు పెంపు

మొగల్తూరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు వ్యవసాయాధికారి అబ్దుల రహీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రుణం తీసుకున్న వారు లేదా రుణం తీసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఏలూరుపాడు బ్రాంచ్ (01911)
భీమవరం-విజయవాడ మెయిన్ రోడ్డు, ఏలూరుపాడు, ప.గో.జిల్లా, ఆం.ప్ర-534236.
ఫోన్ : 93248 01911. ఇ-మెయిల్ : ubin0801917@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన (రూల్-8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 [illegible] రూల్స్, 2002 సంబంధిత రూల్ 3తో చదివే సెక్షన్ 13(12) ప్రకారం [illegible] యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏలూరుపాడు బ్రాంచ్ (01911) [illegible] తేది. 03.10.2024 న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. ఋణగ్రహీత : శ్రీ మహ్మద్ [illegible], [illegible] సహ-ఋణగ్రహీత : శ్రీమతి [illegible] బేగం [illegible] మరియు హామీదారు : శ్రీ [illegible] రూ.11,75,917.84 పై [illegible] ఈ నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా కోరడమైనది.

[illegible] సెక్షన్ 13(4) [illegible] తేది. 02.01.2025 [illegible] స్వాధీనం చేసుకున్నారని ఋణగ్రహీతలు, హామీదారులు మరియు సాధారణ ప్రజలకు [illegible]

[illegible] రూ.11,75,917.84 పై మరియు వడ్డీ, ఇతర ఖర్చులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏలూరుపాడు బ్రాంచ్ (01911) వారి ఛార్జికి లోబడి ఉంటాయి.

[illegible]

స్థిరాస్తి వివరములు

కృష్ణా జిల్లా, కైకలూరు సబ్ రిజిస్ట్రీ, కలిదిండి గ్రామం & మండలం యొక్క ఆర్.ఎస్.నెం. 880/1 నందు విస్తీర్ణం 0-72 సెంట్లులోని 290.4 చ.గ.లు విస్తీర్ణంతో నివాసయోగ్యమైన భూమి & భవనం శ్రీ మహ్మద్ [illegible] గారికి చెందినది. హద్దులు : తూర్పు : [illegible] – [illegible], పడమర : [illegible] – [illegible], దక్షిణం : [illegible] – 46', ఉత్తరం : [illegible] – 46'.

తేది : 02.01.2025
స్థలం : కలిదిండి
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్
90102 23729
79955 66351
90108 51166
Office mail : tpgadvt@gmail.com